www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 12 జులై 2024



పోటా పోటీగా హాకీ పోటీలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పట్టణంలోని వైఎస్ఆర్ క్రీడా మైదానంలో సౌత్ ఇండియా హాకీ ఛాంపియన్ షిప్ హాకీ క్రీడలు పోటాపోటీగా జగుతున్నాయి. గురువారం కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన జూనియర్స్ బాలబాలికల జట్లు తలపడ్డాయి. ఇందులో జూనియర్స్ మహిళా విభాగంలో కేరళ, పాండిచ్చేరి జట్లు తలపడగా 0-5 గోల్ కేరళ జట్టు విజయం సాధించింది. కర్ణాటక-తమిళనాడు జట్లు పోటీ పడగా ఇందులో కర్ణాటక జట్టు 3-1గోల్, ఆంధ్ర-తెలంగాణ జట్లు పోటీపడగా ఆంధ్ర11-0 గోల్‌తో విజయం సాధించాయి. జూనియర్స్ బాలుర విభాగంలో తమిళనాడు-పాండిచ్చేరి జట్లు పోటీపడగా 7 గోల్‌తో తమిళనాడు, తెలంగాణ-కేరళ జట్లు పోటీపడగా 3-0 గోల్ తేడాతో తెలంగాణ విజయం సాధించాయి.

సీజనల్ వ్యాధులు, డయేరియా
నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ లోతేటి శివశంకర్
- విసి ద్వారా మండల స్థాయి అధికారులతో సమీక్ష
- నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై సస్పెన్షన్ వేటు


సీజనల్ వ్యాధులపై మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్

ప్రజాశక్తి -కడప అర్బన్

వైఎస్ఆర్ జిల్లాను డయేరియా రహిత, ఆరోగ్యసహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌తో కలిసి డయేరియా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య భద్రతపై కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా ఖాజీపేట మండలం మిడుతూరులో 19 ఏళ్ల యువకుడు అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన జిల్లా అధికార యంత్రాంగాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా వైద్యాధికారులు, పబ్లిక్ హెల్త్, పంచాయతీ, మున్సిపల్ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ, పట్టణ స్థాయిలో వైద్యారోగ్య, ప్రజారోగ్య, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది బాధ్యతగా, విధిగా పనిచేస్తేనే ప్రజారోగ్య భద్రత సాధ్యం అవుతుందన్నారు. సంబంధిత అధికారులు తప్పకుండా రోజూ విధులకు హాజరవుతూ కింది స్థాయి సిబ్బందిని కూడా సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్య భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు, సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు. ఎఎన్ఎం, ఆశా, సిబ్బందితో ప్రతివారం సమావేశం ఏర్పాటు చేసుకుని ఆరోగ్య కేంద్రాల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల సీజనల్ డ్రగ్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వచ్చిన రోగులతో ఆపాయ్యంగా పలకరించి వైద్య సేవలు అందించాలన్నారు. ఇఒపిఆర్‌డి మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని అన్ని రకాల మంచినీటి పథకాల నిర్వహణలో క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయించేలా చర్యలను చేపట్టాలని జిల్లాలో ప్రతి శుక్రవారాన్ని డ్రైడేని పాటించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు వేడి నీటిని తాగడం, స్వీయ పరిశుభ్రతను పాటించడంపై అవగాహన, విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడ డయేరియా సంబంధిత మరణాలు సంభవించడానికి ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా బయోలజికల్ కాంటామినేషన్‌తో మరణాలు సంభవిస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు తప్పదన్నారు. ముఖ్యంగా అన్ని సంక్షేమ శాఖల అధికారులు సంబందిత హాస్టళ్లలో, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో మంచినీటి సదుపాయాలు, వాటర్ ట్యాంకుల పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా వంట మనుషులకు వంట నిర్వహణలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి, భోజన శాలలను శుచిగా శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే డయేరియా, ప్రజారోగ్య భద్రత, పారిశుధ్య చర్యలు చక్కబెట్టేందుకు జిల్లా స్థాయి నుండి మండల స్థాయి, గ్రామ స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది ప్రతి గ్రామంలో అన్ని గృహాలలో కుళాయి నీటి సదు పాయం నిర్వహణ పనులను పరిశీలించి రాండంగా నీటి పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ వెంకటపతి, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగ రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ అయిషాన్ బాషా, డిఇఒ అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, మైనార్టీ, ఎస్సి కార్పొరేషన్ ఇడి, బిసి వెల్ఫేర్ అధికారి డాక్టర్ వి. బ్రహ్మయ్య, డిజేబుల్, మైనారిటీ సంక్షేమ శాఖా అధికారి కృష్ణ కిశోర్, మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఇమ్రాన్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఆయా మండలాల నుంచి మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

డయేరియాతో విద్యార్థి మృతి


విద్యార్థి మృతిపై ఆరా తీస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని మిడుతూరు గ్రామంలో డయేరియా పెద్ద ఎత్తున విజృంభిస్తోంది. ఇంటికొకరు చొప్పున గ్రామంలో వాంతులు విరేచనాలతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. దాదాపు 20 మందికిపైగా కడప ప్రొద్దుటూరులలో వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇదే గ్రామంలో ఇంటర్ పూర్తి చేసిన సునీల్ (18) డయేరియా కారణంగా కడప నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో కలుషితమైన నీరు తాగడం వల్ల డయేరియాకు గురవుతున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు గ్రామానికి చేరుకొని పరిస్థితిని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించి శుభ్రత చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

మండల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. తన సొంత మండలంలో ఎమ్మెల్యేగా సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మండలం అభివృద్ధిలో వెనుకంజలో ఉందని, పార్టీలకు అతీతంగా అందరి సూచనలు, సలహాలతో అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. సొంత మండలంలో ఎంతో కృషి చేసి ప్రజలు మెజారిటీ అందించారు అన్నారు. బడా నాయకుల భూ కబ్జాల వల్ల పేదలు ఇబ్బంది పడుతున్నారని, ఒకొక్కరికి రెండు డికెటి పట్టాలు ఉన్నాయని, వాటిని పరిశీలించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. త్వరలో రెవెన్యూ అధికారులు కమిటీలు వేసి భూ పరిశీలన చేసి పేదలకు న్యాయం జరిగేలా చూడాలని అంటూ రెవెన్యూ అధికారులకు సూచించారు. అక్రమంగా యంత్రాలు ల పెట్టి భూములు దోచుకుంటే ఒప్పుకునేది లేదని, వాహనాలు సీజ్ చేయాలని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తానని పింఛన్ల పంపిణీలో అధికంగా అవకతవకలు చోటు చేసుకున్నాయని, ఒక పంచాయతీనే 35 దొంగ పింఛన్లున్నాయని పేర్కొన్నారు. నకిలీ సదరం సర్టిఫికెట్లు, ఆధార్‌లో వయసు మార్చుకుని పింఛన్లు పొందుతున్నారని చెప్పారు. అటువంటివి విచారణ చేసి తొలగించాలి అన్నారు. తప్పు చేస్తే అధికారులపైనా చర్యలుంటాయని హెచ్చరించారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనికి వెళ్లకుండానే డబ్బులు లాగేస్తున్నారని, వారిపైనా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. బ్రహ్మంసాగర్ నీళ్లు పిల్ల కాలువలు ద్వారా నీరు ప్రతి ఒకరాకు అందేలా చేస్తానని తెలిపారు. దారి లేని గ్రామాలకు బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న రెండు లైన్ల రహదారికి కూడ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో శ్మశానాలను అభివృద్ధి చేస్తా అన్నారు. సగిలేరు కాలువకు మూడు చెక్ డ్యాం ఏర్పాటు చేయాలన్నారు. సాగర్ నుంచి నీళ్లు తరలించడం చాలా దుర్మార్గమైన చర్య వీటిని అడ్డుకుంటానని చెప్పారు. ఈ ప్రాంత వాసులకే నీళ్లు సరిపోక అల్లాడుతుంటే బయటికి తరలించడం సరైన పద్ధతి కాదన్నారు. మండల కేంద్రంలో అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ వేసి రాబోవు రోజులలో అభివృద్ధి చేయించాలని మఠం మేనేజర్ ఈశ్వరయ్యకి తెలిపారు. మఠం అభివృద్ధికి అవసరమైతే తన తనయుడు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ గ్రాండ్స్‌తో నిధులు తెచ్చి అయినా అభివృద్ధి చేసి తీరుతానన్నారు. బ్రహ్మ సాగర్ నుంచి ప్రతి చెరువు నీరు అందేలా చూడాలన్నారు. రాజోలి ఆనకట్ట వద్ద పనులు వేగవంతం చేసి పూర్తి చేస్తానన్నారు. పదవులు శాశ్వతం కాదు అభివృద్ధి చేస్తేనే ప్రజల గుండెలలో నిలుస్తామన్నారు. బస్టాండ్ కోసం నిర్మాణం కోసం చర్యలు తీసుకు ంటామ న్నారు. మళ్ళీ వచ్చే సమావేశానికి పనులు జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల సమావేశానికి డుమ్మా కొట్టిన ఎక్సైజ్ అధికారులపై రిపోర్టు రాయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి వీరా నారాయణ రెడ్డి, ఎంపిడిఒ శివ మల్లేశ్వారప్ప , తహశీల్దార్ శ్రీనివాసులు , డిప్యూటీ తహశీల్దార్ జాన్సన్ సర్పంచ్‌లు, ఎంపీటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **పుట్టా సుధాకర్‌కు సన్మానం** మండలానికి మొట్ట మొదటిసారిగా మండల సర్వ సభ్య సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను మండలంలోని టిడిపి నాయకులు గురువారం ఘనంగా పూలమాలలతో సన్మాంచారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు సన్నపురి శ్రీను, పోలిరెడ్డి, సాంబ శివారెడ్డి, ఎస్. ఆర్. శ్రీనువాసుల రెడ్డి, పూజ శివయ్య, చిలమల నారాయణ, మేకల సుధాకర్, గుర్రప్ప పాల్గొన్నారు.

అధిక జనాభా దేశ అభివృద్ధికి అవరోధం


గోపవరం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి -గోపవరం

బద్వేల్ మండలం తొడిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ పి జోత్స్న స్వర్ణలత మాట్లాడుతూ అధిక జనాభా వలక్ల దేశ అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు. జనాభాకు తగినటువంటి వనరులు లేక ఇబ్బంది పడవలసి వస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఒకరు లేక ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకుంటే ఆ కుటుంబం ఆనందమయంగా ఉంటుందని చెప్పారు. బిడ్డకు బిడ్డకు ఎడమ కనీసం మూడు సంవత్సరాల కాల వ్యవధి ఉండాలన్నారు. కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులు అవలంభించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు జె. వినయ్ కుమార్, శ్రీనివాసులు, బి వెంగయ్య, హెల్త్ ఎడ్యుకేషన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. చంద్రవతి, హెల్త్ సూపర్‌వైజర్ కె.వెంకటమ్మ, ఆశాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** పేదరిక నిర్మూలన జనాభా నియంత్రణ చాల కీలకమని వైద్యులు స్వాతి సాయి పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కమ్యూనిటీ హైల్త్ సెంటర్ నుండి వైఎస్ఆర్ సర్కిల్ వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, సూపర్ వైజర్స్ ఫకృద్దీన్, వెంకట లక్ష్మి, అరుణాదేవి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా చిలమకూరంలో వైద్యులు సాయి చరిత రెడ్డి ఆధ్వర్యంలో జనాభా పెరుగుదలను అరికట్టేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దంపతులు కుటుంబ నియంత్రణ, తాత్కాలిక పద్ధతులు ఆచరించాలని తెలిపారు. బిడ్డ బిడ్డకు ఎడమ మూడు సంవత్సరాలు ఉండాలని, అప్పుడే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నాగ మునిరెడ్డి,ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** పెరుగుతున్న జనాభా ప్రగతికి అవరోధం అని టిబి రోడ్డు పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ హిమబిందు అన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటి (సిర్డ్స్) ఆధ్వర్యంలో ప్రపంచ జనాభాదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మున్సిపల్ అనిబిసెంట్ ఉన్నతపాఠశాలలో గురువారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు.అనంతరం పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, ఆశాలు, ద్యార్థులు పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే ఉన్నత స్థానం

ప్రజాశక్తి - బద్వేలు : నైతిక విలువలతోనే విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉంటారని పలువురు పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ హై స్కూల్‌లో గురువారం 2023 -2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులను సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నగదు, మహనీయుల ఫోటోలు జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మారెళ్ళ నరసింహులు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారెళ్ళ శ్రీనివాసులు సహకారంతో జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ నైతిక విలువలతో చదివితేనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని, ఇష్టముతో కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని కోరారు. బద్వేలు పట్టణంలో ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం, సావిత్రబాయి పూలే,షేక్ ఫాతిమా బేగ్ లాంటి మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్.ఎ సత్తార్, మహనీయుల ఆశయాల సాధన కమిటీ వ్యవస్థాపకులు బద్వేల్ గురుమూర్తి , మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు సాహితీవేత్త గానుగపెంట హనుమంతరావు, రిటైర్డ్ పి.జి.టి యం.శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కె.వి సుబ్బారావు, ఉర్దూ స్కూలు ప్రధాన ఉపాధ్యాయురాలు రాజేశ్వరమ్మ, మాస్ కమిటీ అధ్యక్షులు షేక్ అల్లాబకాష్, కౌన్సిలర్లు మౌలాలి, మహమ్మద్ హసన్,ఆవాజ్ కార్యదర్శి అన్వర్ బాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన

చెన్నూరు : మండలంలోని ముండ్లపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు గ్రామ పొలాల్లో గురువారం ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ముండ్లపల్లె గ్రామానికి చెందిన యువకుడు యామాల మణికఠ ఉచితంగా ఇచ్చిన పొలాన్ని వారు పరిశీలించారు. దాదాపు 50 సెంట్లు స్థలాన్ని యామాల మణికంఠ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు నిమిత్తం గ్రామ పంచాయతీ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ అప్పగించారు.

బడుగు, బలహీన వర్గాల వారధి ఎంపిజె

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు : బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేసేందుకు వారధిగా మూవ్‌మెంట్‌ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) పనిచేస్తుందని ఆసంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం అన్నారు. స్థానిక ఎంపిజె కార్యాలయంలో గురువారం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌సలీం, సుప్రీం కౌన్సిల్ సభ్యులు హుసేన్ అహ్మద్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. పట్టణ అధ్యక్షులుగా షేక్ హుసేన్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహమ్మద్ రఫీఖ్, కోశాధికారిగా ఇస్మాయిల్, ఉపాధ్యక్షులుగా మహ్మద్‌నజీర్, సహాయ కార్యదర్శిగా అబ్దుల్‌గని, మీడియా కార్యదర్శిగా అస్లాం, సయ్యద్, ఇబ్రహీం, కార్యవర్గ సభ్యులను నూతన కమిటీలో ఎన్నుకున్నారు.

రాజీనామా ఆమోదించడం శోచనీయం

ప్రజాశక్తి- కడప అర్బన్ : కోట్లల్లో అవినీతి చేసిన డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి రాజీనామాలు ఆమోదించడం శోచనీయమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ అన్నారు. గురువారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిపై న్యాయ విచారణ జరపాలి కోరారు. ఎంపీ అవినాష్‌రెడ్డి కనుసన్నల్లో పనిచేసి అవినీతి కి కేర్ ఆఫ్ అడ్రస్ గా మారారని విమర్శించారు. అడ్డదారుల్లో ఉద్యోగోన్నతలు, ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైసిపికే దక్కుతుందని చెప్పారు. అవినీతిపై సిఐడి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యదుభూషణ్‌రెడ్డి స్వచ్ఛందంగా రాజీనామా చేసి బయటి దేశాలలకు వెళ్లాలని ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు కార్యక్రమంలో టిడిపి నాయకులు పాలెంపల్లి సుబ్బారెడ్డి, గంధం మోహన్, బండి బాబు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన విఆర్‌ఒల సంఘం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కలెక్టర్ లోతేటి శివ శంకర్‌ఃను మర్యాద పూర్వకంగా జిల్లా విఆర్‌ఒల సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామ గంగాధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవా నంద కుమార్, ఉపాధ్యక్షులు నాని, రాష్ట్ర కార్యదర్శి విజయ చైతన్య, నాగరాజు, అశోక్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

జెవివి శాస్త్రీయ దృక్పథంపై ప్రచారం

ప్రజాశక్తి- కడప అర్బన్ : శాస్త్రీయ దృక్పథం ప్రచారంలో భాగంగా గురువారం ముత్తరాసు పల్లెలోని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమతా సభ్యులు అరుణ మాట్లాడుతూ చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథంతో జీవించాలని, ప్రశ్నించడం నేర్చుకోవాలని పేర్కొన్నారు. సైన్స్ చెప్పిందే నమ్మాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు సైన్స్ ప్రయోగాలతో పిల్లలకు సైన్స్ వెనక ఉన్న శాస్త్రీయతను తెలిపారు. బాల బయన్న, సమత సభ్యులు సునీత పిల్లలతో మ్యాజిక్ అంశాలు చేయించారు.

గండి హుండీ ఆదాయం రూ.23.87 లక్షలు

ప్రజాశక్తి- చక్రాయపేట : రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో భక్తుల కానుకల ద్వారా రూ.23 లక్షల 87,867 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. నగదుతో పాటు అమెరికన్ 110 డాలర్లు, 1/2,1/4, దినార్లు హుండీలో కానుకలు వేసినట్లు వారు తెలిపారు. లెక్కింపులో కడప దేవాదాయ ఇన్‌స్పెకర్ జనార్ధన్ , చక్రాయపేట ఎపిజిబి బ్యాంకు సిబ్బంది, ఆర్కే వేలి పోలీస్ సిబ్బంది దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ


ధృవపత్రం అందజేస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండలంలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై రెండు రోజుల పాటూ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ వి. శిల్పకళ, పాల పుట్టగొడుగులు, ముత్యపు చిప్ప పుట్టగొడుగుల పెంపకం పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. ప్రశాంతి మాట్లాడుతూ మంచి ఆహారమని భవిష్యత్తులో అందరూ పోష్టి కాహారం పై మొగ్గు చూపుతారని, యువత ఇలాంటి ఉపాధి కల్పించే శిక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని తెలియజేశారు. కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి చాలా మంది శిక్షణ పొంది పుట్టగొడుగుల పెంపకం ఒక కుటీర పరిశ్రమగా పెట్టి మంచి లాభాలు గడిస్తున్నారని చెప్పారు. రైతులు కూడా ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు తరగతి గది లో శిక్షణ ఇచ్చి, రెండవ రోజు ప్రాక్టికల్స్ చేయించారు. అనంతరం ధృవ పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు .కె. సాయి మహేశ్వరి, మహేష్ బాబు పాల్గొన్నారు.

కోలాట బృందానికి కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి - కడప అర్బన్

భారతీయ సంస్కృతిలో జానపదలు, కోలాటాలకు ఓ ప్రత్యేక స్థానం ఉందని కలెక్టర్ లోకేటి శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో అంతర్జాతీయ వండర్స్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం దక్కిన ప్రొద్దుటూరు సావిత్రిబాయి పూలే అభ్యుదయ కోలాట బృందం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళా కోలాట బృందానికి అభినందనలు తెలిపారు. మన సంస్కృతిలో భాగమైన జానపదాలు కోలాటాలు కనుమరుగవుతున్న సమయంలో మన జిల్లాకు చెందిన వారు అంతర్జాతీయంగా ఘనత సాధించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. గత జూలై 29న ప్రొద్దుటూర కు చెందిన మల్లిక బండి ఆధ్వర్యంలో ఓం నమో వెంకటేశాయ ద్వారకా తిరుమల దేవస్థానంలో సావిత్రిబాయి పూలే అభ్యుదయ మహిళ కోలాట బృందం 222 మంది మహిళలతో దశావతారాల జానపద నృత్య కోలాటం ప్రదర్శించి ఈ విజయాన్ని సాధించారు. కార్యక్రమంలో పార్వతి, రమాదేవి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కోతుల బెడదను నివారించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప కేంద్రీయ విద్యాలయలో కోతుల బెడద నివారించాలని కేంద్రదీయ విద్యాలయ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు, కార్పొరేషన్ కమిషనర్ పేషి లో క్యాంప్ క్లార్క్‌కి గురువారం వినతి పత్రం అందజేశారు. రోజూ కేవీ ప్రాంగణంలో కోతులు విద్యార్థుల లంచ్ క్యారియర్లు లాక్కెళుతున్నాయని,రెండు నెలల కిందట రియా అనే 1వ తరగతి విద్యార్థిని ఒక కోతి కరిచి గాయపరిచ్చిందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. రోజు పది మంది దాకా విద్యార్థుల లంచ్ క్యారియర్లు లాక్కేలుతున్నాయని, స్కూల్ సిబ్బంది కోతులను తరిమే ప్రయత్నంలో, వారి మీదికి కరవటానికి వచ్చి, భయాందోళనకు గురిచేస్తున్నాయన్నారు. క్లాసులు జరిగే సమయంలో కోతులు క్లాస్ రూములలోనికి వచ్చి ఇబ్బంది పెడుతున్నాయన్నారు. గతంలో కెవి ప్రిన్సిపల్ ఈ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. కేంద్రీయ విద్యాలయలో కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ ట్రెజరర్ జితేంద్ర, రూట్ 3 కన్వీనర్ దుర్గా ప్రసాద్, కో - కన్వీనర్ నరసింహులు, రూట్ 5 కో కన్వీనర్ శాంసన్ అనిల్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రమాదాలను నివారించండి

ప్రజాశక్తి - కడప : ప్రతి వాహనదారుడూ హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలని కడప రైల్వే స్టేషన్ స్టేషన్ మాస్టర్ శేఖర్ కుమార్ అన్నారు. 'ద్విచక్ర వాహనాలు, పిలియన్ డ్రైవర్ల వినియోగదారులు రక్షిత తలపాగా (హెల్మెట్) ఉపయోగించడంపై గురువారం కడప రైల్వేస్టేషన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను పాటించాలి, రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ ధరించడం ద్విచక్ర వాహనదారులకు క్షేమమని తెలిపారు. ముఖ్యంగా యువత ద్విచక్ర వాహనం అతివేగంగా నడపడం హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి మృతిచెందుతున్నారని వాపోయారు. అతివేగం ప్రాణానికి ముప్పు అని గ్రహించి గమ్యాన్ని చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే శాఖ సిబ్బంది, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు. **ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో..** హెల్మెట్ ధరించండి సురక్షితంగా గమ్యాన్ని చేరండి అనే అంశాలపై ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. హెల్మెట్ వాడడం వల్ల కలిగే ఉపయోగాలను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల మనోహర్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్య రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షకీలా బేగం,గోవింద్ రెడ్డి, కళాశాల సీనియర్ అద్యాపకులు రమణయ్య, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగోన్నతులు కల్పించాలి


ఆర్‌డికి వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌జిఒలు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆర్‌డి పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగోన్నతులు వెంటనే ఇవ్వాలని ఎపి ఎన్‌జిఒ నాయకులు కోరారు. గురువారం ఆర్‌డి డాక్టర్ అరుణ కుమారికి వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎఎన్‌ఎంలను, ఎంపిహెచ్‌ఎస్‌గా, పిహెచ్‌ఎన్‌గా వెంటనే ఉద్యోగోన్నతలు ఇవ్వాలని కోరారు. ఎఎన్ఎం లుగా 18 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వారికి ఉద్యోగోన్నతలు ఇవ్వాలని చెప్పారు. స్పందించిన ఆర్‌డి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సహా అధ్యక్షులు వి.దస్తగిరి రెడ్డి, నంద్యాల ఎన్‌జిఒ నాయకులు హుసేనరెడ్డి, మణి శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

మలబార్‌లో బ్రాండెడ్ జువెలరీ షో

ప్రజాశక్తి - కడప అర్బన్ : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కడపలో బ్రాండెడ్ జ్యువెలరీ సోను డాక్టర్ ముంతాజ్ బేగం, డాక్టర్ ఖదీరున్నిసా, డాక్టర్ ఆయేషా ప్రారంభించారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రాంచ్ హెడ్ లిసన్ సత్యన్ మార్కెటింగ్ మేనేజర్ ఇషాక్ బాషా మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 14 వరకు ప్రత్యేక షో ఉంటుందని పేర్కొన్నారు. గోల్డ్, వజ్రభరణాలు, డైమండ్స్ ప్రదర్శిస్తున్నామని, ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


నగలు, వజ్ర ఆభరణాలు ప్రదర్శిస్తున్న సిబ్బంది



పాడి రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ వాసా శ్రీనివాస

పశువులకు పచ్చిగడ్డి ఆరోగ్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువులకు పచ్చి గడ్డి ఆరోగ్యకరమైన ఆహారమని కొత్తపల్లె పశు వైద్యులు వాసా శ్రీనివాస అన్నారు. పశు గ్రాస వారోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తపల్లెలో పశు వైద్యాధికారి ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు గ్రాస వారోత్సవాల్లో భాగంగా ఏక వార్షికాలైన జొన్న, మొక్క జొన్న, సజ్జ, పిల్లి పెసరలు, అలసందలు వాడకంపై పాడి రైతులకు వివరించారు. బహు వార్షికాలైన సూపర్ నేపియర్, పారా గ్రాస్, గినీ గ్రాస్, లూసర్న్ వంటి పచ్చి గడ్డి వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. పశువులకు పచ్చి గడ్డి పెట్టడం వల్ల ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. దీని వల్ల అధిక పాల ఉత్పత్తి జరిగి పాలల్లో వెన్న శాతం పెరుగుతుందన్నారు. తద్వారా పాడి రైతులకు ఎక్కువ ఆదాయం లభిస్తుందన్నారు. ఈనెల 14 వరకు పశు గ్రాస వారోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. **నీలి నాలుక టీకాలు వేయించాలి..** గొర్రెలు, మేకలకు నీలి నాలుక టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. తిమ్మాపురం గ్రామంలో గురువారం వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నీలి నాలుక (బ్లూ టంగు)టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గొర్రెలు,మేకలకు నీలి నాలుక టీకా వేయకపోతే నోటి పుండ్లు, జ్వరం వచ్చి నీరశించి చనిపోయే అవకాశం ఉందన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 9,500 గొర్రెలు,మేకలకు టీకాలు వేసినట్లు చెప్పారు.గొర్రెలు, మేకలకు నీలి నాలుక తప్పకుండా వేయించాలని కాపరులు, యజమానులను ఆయన కోరారు. కార్యక్రమంలో పశు సహాయక సిబ్బంది వీరేంద్ర పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం మహిళల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను ప్రవేశ పెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీదేవి అన్నారు. గురువారం మండలం పరిధిలోని కొత్తపేట సెక్టర్ దుంపలగట్టు అంగన్వాడీ కేంద్రంలో మహిళా చట్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళలకు రక్షణగా వన్ స్టాప్ సెంటర్‌ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం నూతన చట్టాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు. బాల్య వివాహాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు జహిరాబి, అంగన్వాడీ కార్యకర్త జె. గంగావతి, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడండి

ప్రజాశక్తి-కలసపాడు

మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రఘునాథరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఎగువరామాపురం పాఠశాలలోని విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగడా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలన్నారు. ప్రతి బిడ్డకు తల్లిపాలు ఎలా ఉపయోగమో సకల చరాచర జీవరాసులకు జీవన మనుగడ కోసం చెట్లు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పర్యావరణం కాలుష్యంపైన వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కమల్ బాష, సెక్షన్ ఆఫీసర్ రమణయ్య, బీట్ ఆఫీసర్ కరుణాకర్, అసాన్ బాష, సుభాషిని, భారతి అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అని ఉప సర్పంచ్ దాసరి ఆంజనేయులు పేర్కొన్నారు. .గురువారం మండలంలోని సురభి గ్రామ పంచాయతీ నాగలగట్టుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ సూచనల మేరకు పులివెందుల డివిజన్‌లోని అధికారుల సాయంతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి రామకృష్ణ, దాసరి శ్రీకర్, తుపాకుల చంద్ర పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండుగ సందర్భంగా చావిడిలలో పీర్లు కొలువుదిరాయి. గురువారం మండలంలోని సింహాద్రిపురం, గురజాల గ్రామాలలో నిర్వాహకులు పీర్లను ప్రత్యేకంగా అలంకరించి చదివింపులు చదివారు. ఆదివారం చిన్న సరిగెత్తులో భాగంగా పీర్లను బ్యాండ్ మేళం నడుమ గ్రామోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

క్రైం కార్నర్

భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ముద్దనూరు



నిందితులతో సిఐ దస్తగిరి

మండలంలోని చిన్నదుద్యాల గ్రామంలో బోరెడ్డి ప్రభావతమ్మకు చెందిన భూమిని ఆధార్ కార్డు మార్పు చేసి అక్రమంగా రిజిస్టర్ చేసుకున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ దస్తగిరి పేర్కొన్నారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభావతమ్మకు చిన్నదుద్యాల గ్రామ పొలాల్లో సర్వే నెంబరు 25లో 4.54 ఎకరాల భూమి ఉంది. ఆమె ప్రస్తుతం వేరే ఊర్లో నివాసం ఉంటున్నారు. ఆమె భూమిని కాజేసేందుకు చిన్నదుద్యాల గ్రామానికి చెందిన బోరెడ్డి వెంకట మదన మోహన్ రెడ్డి, తన అత్త సానం సావిత్రమ్మ ఆధార్ కార్డును ప్రభావతమ్మగా మార్పించాడు. అనంతరం ఫిబ్రవరి 2న ముద్దనూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. భూమిని కాజేశారని విషయం తెలుసుకున్న భూమి యజమాని ప్రభావతమ్మ అధికారులకు పిర్యాదు చేశారు. సబ్ రిస్ట్రార్ దర్బా మహబూబ్ బాషా, సిబ్బంది విచారించి ఫిబ్రవరి 29న బోరెడ్డి వెంకట మదన మోహన్ రెడ్డి, సానం సావిత్రమ్మ, నాగిరెడ్డి, ఇద్దరు సాక్షుల పైన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సబ్ రిజిస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సిఐ తెలిపారు. కేసు విచారణ అనంతరం బోరెడ్డి ప్రభావతమ్మ భూమిని అక్రమంగా రిజిస్టరు చేయించుకున్న బోరెడ్డి వెంకట మదన మోహన్ రెడ్డిని, ఆధార్ కార్డు మార్పు చేసిన కడపకు చెందిన నెట్ సెంటర్ యజమాని బండి నాగి రెడ్డిని గురువారం అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరిద్దరిని జమ్మలమడుగు కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.

లింగారెడ్డిపల్లెలో బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి-కలసపాడు



బీరువాను తెరిచిన దుండగలు

మండలంలోని లింగారెడ్డి పల్లె గ్రామంలో బుధవారం రాత్రి పాలకొలను రామసుబ్బారెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. ఇంటిలోని వారి బీరువాలో ఉన్న బట్టలను కింద పడవేసి సుమారు 8 తులాలు బంగారం, రూ. 70 లక్షల నగదును దుండగులు తీసుకుని వెళ్లారని బాధితుడు రామ సుబ్బారెడ్డి తెలిపారు. నగదు భూముల పెట్టుబడి కోసం, బంగారు నగలు బామర్ది బిడ్డ పెళ్లికోసం ఉంచుకున్నామని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలు సుకున్న పోలీసులు హుటాహుటినా సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం

- అధ్వానంగా రహదారులు
- వరదలొస్తే రాకపోకలు బంద్
- ప్రధాన గ్రామాలకు బస్సులు నిల్
- కొన్ని గ్రామాల్లో తాగునీటికీ కటకట
- నేడు మండల సర్వసభ్య సమావేశం





కోతకు గురవుతున్న కుందూనది

ప్రజాశక్తి - చాపాడు

నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన పుట్టా సుధాకర్‌యాదవ్‌కు మండల పరిధిలోని సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. శుక్రవారం ఎంపిపి టి.లక్ష్మ మయ్య అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ప్రధాన సమష్యలపై ప్రత్యేక కథనం..

మండల పరిధిలో కొన్ని ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలు అనేకం ఉన్నాయి. సర్పంచులకు వస్తున్న అరకొర నిధులతో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫల మయ్యారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గుంతచియ్యపాడు, చాపాడు గ్రామాల మధ్య వంకల పై ఉన్న బ్రిడ్జిలు ఎత్తు పెంచాలి. కుందూ నదికి వరదలు వచ్చినప్పుడు ఈ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. సోమాపురం హరిజనవాడ, సిద్దారెడ్డిపల్లె - జడ్జిగారికొట్టాల్, నాగాయపల్లె - నెర్రవాడ గ్రామాల అధ్వాన్నంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉంది. మండల పరిధిలో రజకులకు దోబీ ఘాట్లు లేక కుందూ నది, కెసి కాలువల వద్ద రజకులు ఇబ్బందులు పడుతున్నారు. వీలైనన్ని చోట్ల దోభి ఘాట్ల ఏర్పాటుకు కృషి చేయాల్సి ఉంది. అలాగే కుందూ నదికి వరదలు వచ్చినప్పుడు పొలాలు కోతకు గురవుతున్నాయి. కరకట్టలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మైదుకూరు - ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై మండల కేంద్రమైన చాపాడు ,అల్లాడుపల్లె, బద్రిపల్లె గ్రామాల వద్ద బస్టాండ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే చియ్యపాడు, సీతారామపురం, సోమాపురం, మడూరు గ్రామాల మీదుగా ఆర్‌టిసి బస్సులను నడపాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆర్‌టిసి సౌకర్యం లేకపోవడంతో ఆటోలలో అసౌకర్యంగా ప్రయాణించాల్సి వస్తుంది. వీటితో పాటు మండల పరిధిలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సి ఉంది. చియ్యపాడు, ఖాదర్‌పల్లె తదితర గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తుతుంది. నిధులు మంజూరు చేసి నూతనంగా బోర్లు వేయాల్సి ఉంది. వీటితోపాటు ప్రతి గ్రామంలో చిన్నపాటి సమస్యలు అనేకం ఉన్నాయి. వీటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఎన్నికల హామీలు ఇచ్చిన విధంగా అన్ని గ్రామాలకు శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలి. నిధుల మంజూరుకు హామీ ఇచ్చి గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక కృషి చేయాల్సి ఉంది .



గుండ్ల వంకపై ప్రస్తుతం ఉన్న లో లెవెల్ బ్రిడ్జి

కలుషిత నీటిని నివారించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి పలు సమస్యలు
- పలు శాఖల అధికారులు గైర్హాజర్



చిలమకూరు సమస్యలపై మాట్లాడుతున్న ఎంపిటిసి నవీన్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగొండ నగర పంచాయతీలోని డ్రెయినేజీ కాలువల గుండా వచ్చే మురుగునీరు పాగేరు వంకలో కలవడం ద్వారా నీరు కలుషితం అవుతుందని కోడూరు సర్పంచ్ వాసుదేవరెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. మండల పరిధిలో జరుగుతున్న పనుల గురించి ఆయా శాఖల అధికారులు సభ్యులకు వివరించారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సభ్యులను అడగగా, కోడూరు గ్రామ సర్పంచ్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ నగర పంచాయతీలోని మురుగునీరు డ్రెయినేజీ కాలువల ద్వారా పాగేరు వంకలో కలుస్తున్నాయని, వేంపల్లి రోడ్డులో డ్రెయినేజీ అసంపూర్తి నిర్మాణం కారణంగా కోడూరు సరిహద్దు పొలాల్లో మురుగునీరు నిలుస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. నూతనంగా నిర్మితమవుతున్న ఆరు వరసల జాతీయ రహదారి కారణంగా సమీప పొలాలకు దారి లేకుండా నిర్మిస్తున్నారని తెలిపారు .కోడూరు గ్రామానికి, కమలాపురం మండలంలోని తుర్కపల్లి గ్రామానికి ఒకే విద్యుత్ లైన్ ఇవ్వడం కారణంగా గ్రామంలో రోజూ విద్యుత్ సమస్య తలెత్తుతోందని తెలిపారు. గతంలో గ్రామసభ సాక్షిగా ఆరో వరుసల రహదారి నిర్మాణంలో రైతుల మిగులు భూములు (20,30,50 సెంట్లు) తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే ఆరు వరుసల రహదారిలో పొలాల్లోని నీరు వెళ్లడానికి ఎక్కడా కూడా కల్వర్టులు నిర్మించడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి హామీ పనులు సర్పంచ్, పంచాయతీ సెక్రటరీకి కూడా తెలపకుండా చేస్తున్నారని, పాగేరు వంకలో జమ్ము తొలగించాలని ఎన్నో సమావేశాల్లో తెలిపిన పట్టించుకోలేదని అన్నారు. తహశీల్దార్ సౌజన్య లక్ష్మి మాట్లాడుతూ ఆరు వరసల జాతీయ రహదారి కారణంగా రైతుల సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మండల ప్రత్యేక అధికారి శాంతి మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. చిలంకూరు ఎస్‌సి కాలనీలో తాగునీరు అందడం లేదని రోజు కేవలం అరగంట మాత్రమే వస్తున్నాయని ఎంపిటిసి నవీన్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి శాంతి మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి, ఐసిఎల్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే జలజీవన్ మిషన్ ద్వారా కావాల్సిన ప్రతిపాదనలు పంపి నీరు అందించే చర్యలు చేపడతామని తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల మండల అధికారులు గైర్హాజరు కావడంతో ప్రత్యేక అధికారి శాంతి ఆరా తీశారు. తర్వాతి సమావేశానికి కచ్చితంగా హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ జాషువా, ఎంపిటిసిలు,సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

- డిఎస్‌పికి డిప్యూటీ తహశీల్దార్ ఫిర్యాదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



డిఎస్‌పి ఇచ్చే ఫిర్యాదును చూపిస్తున్న కొండాపురం డిటి, విశ్రాంత తహశీల్దార్

తన విధులకు ఆటంకం కలిగిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ ఇ.రాజేశ్వరమ్మ జమ్మలమడుగు డిఎస్‌పి యస్వంత్‌ను కోరారు. గురువారం ఉదయం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పికి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను కొండాపురం మండలం తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్నానన్నారు. తాడిపత్రి పట్టణంలో నివాసం ఉంటూ కార్యాలయానికి ఉద్యోగరీత్యా వస్తు పోతూ ఉంటానన్నారు. కె.సుగుమంచిపల్లిలో సర్వే నంబర్ 133- 4 విస్తీర్ణం 0.33 సెంట్లు గల భూమిని చట్ట ప్రకారం కొనుగోలు చేసి ఆ స్థలంలో రూములు నిర్మించారని చెప్పారు. సుగుమంచిపల్లి గ్రామానికి చెందిన పెద్ద రంగారెడ్డి గారి చిన్నారెడ్డి, పెద్ద రంగారెడ్డి గారి చంద్రశేఖర్ రెడ్డి, పెద్ద రంగారెడ్డి గారి రంగనాథ్ రెడ్డి అనే వ్యక్తులు భూమిని అనైతిక పద్ధతుల ద్వారా తాము పొందానని తప్పుడు ప్రచారం చేస్తూ తనను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. తాడిపత్రి నుంచి కొండాపురంకు కారులో ప్రయాణిస్తూ ఉంటే మధ్యలో అడ్డగించి వారి పేరు మీద రెండు రూములు లేదా పది లక్షలు డబ్బులు ఇవ్వాలని, లేకుండా చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ భూమిపై పై వ్యక్తులు కర్నూల్ లోకాయుక్త వారి దగ్గర కేసు నడుపుతూ త్వరగా లబ్ధి పొందాలని డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. డబ్బులు ఇవ్వకపోతే తాను వెళ్లే కారును లారీ తో ఢీ కొట్టి చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండాపురంలోని తహశీల్దార్ కార్యాలయం దగ్గరకు వచ్చి అసభ్య పదజాలంతో దూషిస్తూ తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆమె డిఎస్‌పితో మొరపెట్టుకున్నారు. తాళ్ళ ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌లో తనపై తప్పుడు కేసులు పెట్టి విచారించకుండా, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్కడి పోలీసులు ఎఫ్ఐఆర్ తనపై నమోదు చేశారని చెప్పారు. ఇంకా తనపై అసత్య ప్రచారాలు సోషల్ మీడియా ద్వారా వైరల్ చేస్తూ ఉన్నారన్నారు. పైన తెలుపబడిన వ్యక్తుల ద్వారా తనకు ప్రాణహాని ఉందని అందుకే తమరికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నామని చెప్పారు. ఆమెతోపాటు విశ్రాంత తహశీల్దార్ సివివి ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

విద్యాలయాల్లో గంజాయిని అరికట్టాలి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నీ గత ప్రభుత్వంలో అస్తవ్యస్తంగా మారినాయాని కాబట్టి చంద్రబాబు పాలనలోనైనా విశ్వవిద్యాలయాలను గాడిలో పెట్టాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి విద్యార్థుల పట్ల కంస మామాల, శకుని మామాల ప్రవర్తించాడని చెప్పారు. జగన్ ప్రభుత్వం జారి చేసిన జీవో 117 ప్రాథమిక విద్య ప్రాణం తీసిందని చెప్పారు. జీవో 117ను రద్దు చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో గంజాయిని ఆరికట్టాలని చెప్పారు. ప్రయివేటు, ఎయిడెడ్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన వర్తింప జేయాలని కోరారు. జీవో 77ను కూడా రద్దు చేసి ఉన్నత విద్య చదివే విద్యార్థులకు విద్యా దివెన, వసతి దీవెన వర్తింప జేయాలని కోరారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ఫిర్యాదు

ప్రజాశక్తి-చెన్నూరు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్‌యదవ్‌కు మండల బిజెపి అధ్యక్షులు గాడి భాస్కర్ గురువారం వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆరోగ్య కేంద్రం 30 పడకల నిర్మాణానికి రూ. 4. 70 కోట్లు మంజూరు చేశారని, ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం సామాజిక ఆరోగ్య కేంద్రం రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ అరకొర వసతుల మధ్య నడుస్తోందన్నారు. రోజూ వందల సంఖ్యలో రోగులు వస్తుండడంతో వైద్య సేవలు అందక అరకొర వసతులతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది కొరత వైద్యులు మందులు కొరత కారణంగా రోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొండపేట గ్రామంలో ఏర్పాటు చేయకుండా చెన్నూరు మండల అభివృద్ధి కార్యాలయంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్‌లో నడుపుతున్నారని తెలిపారు. కొండపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు చేపట్టి ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అక్కడికి తరలించాలని మంత్రికి విన్నవించారు.

ట్రిపుల్‌ఐటికి 21 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -సింహాద్రిపురం

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటిలకు 21 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి ఓబులేసు, మండల విద్యాధికారి - 2 శారద తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంకలమ్మ గూడూరు 3, బలపనూరు 3, హిమకుంట్ల 6, సింహాద్రిపురం3, కేజీబీవీ నిడి విలగల4, గురజాల 2 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని చెప్పారు. ఇందులో ఇడుపులపాయ 13, నూజివీడు2, ఒంగోలు4, శ్రీకాకుళం2 మంది విద్యార్థులు ఎంపిక య్యారని పేర్కొన్నారు. **వేంపల్లె :** ఆర్‌జెయుకెటి విడుదల చేసిన సీట్లు కేటాయింపు ఫలితాల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటికి నారాయణ పాఠశాల విద్యార్థి పల్లేట నాని ఎంపికైనట్లు అ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణ పాఠశాలలో చదివిన పల్లేటి నానికి పదోతరగతిలో 588 మార్కులు సాధించాడు. గురువారం ఆర్‌జెయుకెటి విడుదల చేసిన ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన నాని ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు చెప్పారు. పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థి కష్ట పడి చదవడంతో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించడం ద్వారా ట్రిపుల్ ఐటిలో సీటు సంపాదించారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి ట్రిపుల్ ఐటిలో సీటు పొందడం సంతోషంగా ఉందన్నారు. **ఖాజీపేట :**స్థానిక కస్తూరిబా పాఠశాల విద్యార్థిని హన్సిక ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు గురువారం తెలిపారు. విద్యార్థిని ఈ ఏడాది పది పరీక్షలో 578 మార్కులు సాధించింది. విద్యార్థిని ట్రిపుల్ ఐటికి ఎంపిక పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

సీట్లు పొందిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి

ప్రజాశక్తి - వేంపల్లె : ఆర్‌జెయుకెటి పరిధిలోని ఆయా ట్రిపుల్ ఐటీటి 2024-25 విద్యా సంవత్సరానికి గాను సీట్లు పొందిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌జెయుకెటి పరిధిలోని ఆర్‌కె వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం, నూజివీడు ట్రిపుల్ ఐటీలకు చెందిన జనరల్ కేటగిరిలో (ఒసి, బిసి, ఎస్సీ, ఎస్టీ) కింద సీట్లు పొందిన విద్యార్థుల జాబితాను విడుదల చేసినట్లు చెప్పారు. విడుదల చేసిన జాబితా ఆర్‌జెయుకెటి వైబ్ సెట్ లో ఉంచినట్లు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు వారికి కేటాయించిన క్యాంపస్‌లో హజరై సీటును ధృవీకరించుకోవాలని కోరారు. ఈనెల 22,23 తేదిల్లో ఇడుపులపాయ (ఆర్కేవ్యాలీ), నూజివీడు ట్రిపుల్ ఐటిలో, 24,25, ఒంగోలు ట్రిపుల్ ఐటిలో 26,27 తేదిల్లో శ్రీకాకుళం ట్రిపుల్ క్యాంపస్‌లో కౌన్సెలింగ్ ఉంటుందని, ఆయా తేదిల్లో విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

అతిసారపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - చాపాడు

అతిసార వ్యాధితో చాలా ప్రమాదమని, జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి శ్రీవాణి, డాక్టర్ ఓబులేసు తెలిపారు. వెదురూరు, నరహరిపురం పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలల్లో , గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రోజులో మూడు, నాలుగు అంతకంటే ఎక్కువ సార్లు పలుచగా విరోచనాలు అయితే దాన్ని అతిసార అంటారని, అందువల్ల విటమిన్ ఎ సిరప్ తాగించాలని సూచించారు. స్వచ్ఛమైన తాగునీటిని ఉపయోగించాలన్నారు. భోజనానికి ముందు, మరుగు దొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవాలని, తల్లి పాలు మాత్రమే ఇవ్వడం, అనుబంధ ఆహారం, రోటా వైరస్ తట్టు టీకాలు వేయించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను గురించి తెలియజేశారు. మొదటి ఆరు నెలలు తప్పని సరిగా తల్లి పాలు తగించాలన్నారు. డయేరియా వ్యాధి ఉన్నప్పుడుఓఆర్ ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు చికిత్స తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం శరీరం కోల్పోయిన నీటిని ఖనిజాలను తిరిగి నింపుతుందని, జింక్ మాత్రలు రోగనిరోధక వ్యవస్థను మెరుగు పరుస్తుందని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, సూపర్ వైజర్స్ సరస్వతీ, బాబురెడ్డి, ఎంఎల్ హెచ్ పి ఫర్హాట్ అంజుమ్, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, జ్యోతి, వేదమణి, రామసుబ్బమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా ఫయాజ్

ప్రజాశక్తి - వేంపల్లె



టిడిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా ముల్లా ఫయాజ్ బాషా (యాంగ్ బాయ్) ఎన్నికయ్యారని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. వేంపల్లె గ్రామానికి చెందిన ఫయాజ్ బాషా టిడిపి మండల ప్రధాన కార్యదర్శిగా ఉండి పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ టిడిపి పార్టీకి ఓట్లు వచ్చేలాగా పనిచేశారు. ఈనేపథ్యంలో టిడిపి అధిష్టానం ఫయాజ్ బాష సేవలను గుర్తించి పులివెందుల ఇన్‌చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి సూచన మేరకు నియమించినట్లు మండల కన్వీనర్ తెలిపారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని తెలిపారు. మండల పరిశీలకులు రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. జిల్లాలోని మైనార్టీలను ఏకం చేసి టిడిపిని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్ బాషా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా పదవి ఇచ్చినందుకు పులివెందుల ఇన్‌చార్జికి, మండల పరిశీలకులకు, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, మండల కన్వీనర్‌కు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ బాషాలకు ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు.



పశువులకు వైద్యం అందిస్తున్న పశువైద్యాధికారి ఎ.వెంకటేశ్వర్లు

పశువులకు గర్భకోశ నివారణ టీకాలు

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని రామాపురం పంచాయతీలో రెడ్డిపల్లి గ్రామంలో నందు సుమారు 78 పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా ఉచిత టీకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్. పశు వైద్య సహాయ చికిత్స నిపుణులు, డాక్టర్ శివరామిరెడ్డి సౌజన్యంతో కలసపాడు మండల పశువైద్యాధికారి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు మాట్లాడుతూ ఈ శిబిరంలో సుమారు 78 పశువులు వివిధ రకాల రోగాలతో రైతులు తీసుకొచ్చారని, ఇందులో 16 పశువులు గర్భకోశ వ్యాధికి సంబంధించి, ఎదకురాని పశువులు 40, అలాగే మొదటి చూలు, పశువులు 22 ఉండగా , 18 పశువులు వివిధ రకాల ఆరోగ్య పరిస్థితుల బట్టి చికిత్స అందించామని చెప్పారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్, చంద్రశేఖర్ టేకూర్‌పేట, పశు వైద్యాధికారి కె. శివ శ్రీనివాసరెడ్డి, అనిమల్ హస్బండరీలు, పాలమిత్రులు, రైతులు పాల్గొన్నారు.